
'గోదావరి' కోసం అంత తొందరేంటో? IIలో


ఏయూలో అంధకారం IIలో


సాగరతీరాన ఆసీస్ విజయ గర్జన IIలో

న్యూస్‌రీల్

జీఎస్టీ 2.0 ఓ గేమ్ ఛేంజర్


బైక్‌పై కలెక్టర్ హరేందిర ప్రసాద్

మద్దిలపాలెం : జీఎస్టీ 2.0 పేదల జీవితాల్లో వెలుగులు నింపి, స్వర్ణాంధ్ర సాధనలో గేమ్ ఛేంజర్ కానుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఉద్ఘాటించారు. ఈ శుభపరిణామం వల్ల భారతదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్'పై అవగాహన కోసం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రారంభమైన 'ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాలుగు స్లాబ్‌ల నుంచి జీఎస్టీని రెండు స్లాబ్‌లకు తగ్గించడం చారిత్రక నిర్ణయమని కలెక్టర్ పేర్కొన్నారు. 1990లలోని ఎల్‌పీజీ (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) లాగే ఇది అద్భుత ఫలితాలను ఇస్తుందని, ప్రజల ఆర్థిక శక్తిని పెంచుతుందని తెలిపారు. 2047 లక్ష్యాలను సాధించి భారతదేశం నెం.1 స్థానంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ షాపింగ్ ఫెస్టివల్ ద్వారా జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలనేది ఉద్దేశమని చెప్పారు. అనంతరం ఆయన 66 స్టాళ్లను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వైజాగ్ హాఫ్ మారథాన్‌కు భారీ స్పందన


మారథాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ బాగ్చి

ఏయూ క్యాంపస్: వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్.. వైజాగ్ హాఫ్ మారథాన్ 2025 బీచ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో 2 వేల మందికి పైగా పాల్గొన్నారు. మారథాన్‌లో హాఫ్ మారథాన్ (21.1 కి.మీ), 10 కి.మీ పరుగు, 5 కి.మీ ఫన్ రన్ ఉన్నాయి. ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ మీదుగా ఈ మారథాన్‌ను నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం కమిషనర్ రన్‌లో పాల్గొన్న వారిని అభినందించారు. డిసెంబర్ 6, 7 తేదీల్లో పాడేరులో 100 కిలోమీటర్ల రన్ కూడా పెడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు www.vtra.run వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు రెండో విడత చెల్లింపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) చేసిన ఉద్యోగులకు గురువారం వీఆర్ఎస్ పరిహారం రెండో విడత చెల్లింపులు చేశారు. దీంతో ఇప్పటి వరకు 50 శాతం పరిహారం చెల్లించినట్టయింది. ఉక్కు యాజమాన్యం ప్రకటించిన వీఆర్ఎస్-2లో యాజమాన్యం మొత్తం 464 మందికి వీఆర్ఎస్ ఇచ్చారు. వారు సెప్టెంబర్ 30న రిలీవ్ అయ్యారు. చివరి రోజు చెల్లించాల్సిన పరిహారాన్ని నాలుగు విడతలుగా చెల్లించడానికి యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన మొదట విడత 25 శాతం చెల్లించగా ఇప్పుడు రెండో విడత చెల్లించారు. నెలాఖరులోగా మిగిలిన 50 శాతం చెల్లిస్తారని వీఆర్ఎస్ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్యాషన్ అండ్ గార్మెంట్ మేకింగ్ వృత్తివిద్యా కోర్సు బోధనకు ఒక అతిథి అధ్యాపక పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జె.వి జయ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ (టెక్స్‌టైల్ అండ్ క్లాతింగ్ ఇన్ హోంసైన్స్)లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులు. ఈ నెల 22న ఇంటర్వ్యూ జరుగుతుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర వివరాల కోసం మద్దిలపాలెంలోని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

రేపు 'క్లీన్ ఎయిర్'పై ప్రత్యేక డ్రైవ్

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 18న (మూడో శనివారం) 'క్లీన్ ఎయిర్' అనే అంశంపై స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

● డీఆర్వోకి పప్పు..ఉప్పు..కొనివ్వాల్సిందే..!

రెవెన్యూలో శ్రీలేఖ కలకలం


ఆర్డీవో శ్రీలేఖ


డీఆర్వో భవానీశంకర్

ప్రతి నెలా రూ.20 వేల ఖర్చు

శ్రీకాకుళంలోని డీఆర్వో కుటుంబానికీ ప్రతి నెలా కిరాణా సరకులు వంపాల్సిందే

తహసీల్దారు కార్యాలయాలకు భారంగా వ్యవహారం

డీఆర్వో భవానీశంకర్‌ను నియంత్రించాలంటూ కలెక్టర్‌కు ఆర్డీవో శ్రీలేఖ లేఖాస్త్రం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) క్యాంపు కార్యాలయానికి అవసరమైన చింతపండు, పసుపు, గోధుమపిండితోపాటు ఫెయిర్ అండ్ లవ్లీ క్రీములు, బట్టల క్లిప్పులు ఇలా అన్నీ కొనివ్వాల్సిందే. ఈ భారమంతా నా పరిధిలోని తహసీల్దారు కార్యాలయాలపై పడుతోంది. ప్రతి నెలా రూ.20 వేల విలువైన కిరాణా సామగ్రి పంపాల్సి వస్తోంది. అంతేకాకుండా శ్రీకాకుళంలోని డీఆర్వో కుటుంబానికి కూడా ప్రతి నెలా కిరాణా సామగ్రి పంపాల్సి వస్తోంది. గాజువాక, పెందుర్తి తహసీల్దారు కార్యాలయ సిబ్బందిపై ఈ భారాన్ని మోపుతున్నారు. దీనిపై విచారణ చేసి ఆ ఖర్చు పడకుండా చూడండి' అంటూ కలెక్టరుకు విశాఖపట్నం ఆర్డీవో శ్రీలేఖ లేఖ రాయడం సంచలనమైంది.

ప్రతి నెలా ఈ భారాన్ని మోపకుండా చూడాలంటూ కలెక్టరును అభ్యర్థించిన ఆమె.. దీని ప్రభావంతో రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడటం ద్వారా ప్రజల్లో చులకన అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

● సీతమ్మధార, పద్మనాభం మండలాల పరిధిలోని రెవెన్యూ సిబ్బందిపై కూడా ఇదే తరహాలో ఉప్పు, పప్పు భారం మోపుతున్నట్టు ఆమె ఆరోపించారు. రెవెన్యూశాఖ ఉన్నతాధికారి కావడంతో సిబ్బంది ఏమీ అనలేకపోతున్నారని... ఈ కారణంగా సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారని శ్రీలేఖ పేర్కొన్నారు. అయితే దీనిపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఇద్దరి మధ్య కోల్డ్‌వార్

వాస్తవానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగంలో లోలోపల వివాదాలు నడుస్తున్నట్టు తెలుస్తోంది. డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవో శ్రీలేఖల మధ్య కొంత కాలంగా పలు వ్యవహారాల్లో కోల్డ్ వార్ నడుస్తోందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇరువురూ ఉప్పు-నిప్పుగా వ్యవహరిస్తున్నట్టు కూడా చర్చ జరుగుతోంది. తాజాగా కలెక్టర్‌కు రాసిన లేఖతో వీరువురి మధ్య వివాదం కాస్తా ముదురు పాకాన పడినట్టు తెలుస్తోంది.


కలెక్టర్‌కు ఆర్డీవో శ్రీలేఖ రాసిన లేఖ

శ్రీకాకుళానికి కిరాణా సామగ్రి

ప్రతి నెలా డీఆర్వో క్యాంపు కార్యాలయానికి అవసరమైన కిరాణా సామగ్రి ఖర్చు రూ.20 వేల వరకూ అవుతోందని తాను సేకరించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందని ఆర్డీవో తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా డీఆర్వో భవానీశంకర్ కుటుంబం ఉంటున్న శ్రీకాకుళానికి కూడా పంపాల్సి వస్తోందంటూ పేర్కొనడం గమనార్హం. కేజీ చింతపండు, కేజీ పసుపు కొమ్ములు, కిరాణాతోపాటు ఫెయిర్ అండ్ లవ్లీ క్రీములు, బట్టల క్లిప్పుల ఖర్చు భారం రెవెన్యూ సిబ్బందిపై వేస్తున్నారంటూ తన లేఖలో ఆరోపించడం గమనార్హం. రెవెన్యూశాఖ పరిధిలో డీఆర్వో ఉన్నతాధికారి కావడంతో.... రెవెన్యూ సిబ్బందిపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని ఆమె పేర్కొన్నారు. తద్వారా కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిలో అవినీతి పెరిగిపోయేందుకు కూడా ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

విచారణ జరపండి..

డీఆర్వో క్యాంపు ఖర్చుల భారం తన పరిధిలోని పెందుర్తి, గాజువాక రెవెన్యూ సిబ్బందితో పాటు సీతమ్మధార, పద్మనాభం మండలాల పరిధిలోని రెవెన్యూ సిబ్బందిపై కూడా పడుతున్నట్టు పేర్కొన్నారు. క్యాంపు ఖర్చులకు సంబంధించిన బిల్లులన్నీ చేతితో రాసినవే ఉన్నాయని... కంప్యూటర్ బిల్లులు మాత్రం తన వద్ద లేవని లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని కలెక్టరుకు విన్నవించారు. తన పరిధిలోని తహసీల్దారు కార్యాలయ సిబ్బంది నుంచి డీఆర్వో క్యాంపు ఖర్చుల భారం పడకుండా చూడాలని కూడా ఆమె తన లేఖలో కలెక్టరును కోరారు. ఈ వ్యవహారం ఎటువైపు దారితీస్తుందో చూడాల్సి ఉంది. అయితే ఈ లేఖపై కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారా? లేఖ రాసిన ఆర్డీవోపై చర్యలు తీసుకుంటారా అనేది చూడాల్సి ఉంది.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి



విశాఖ సిటీ: బాణసంచా విక్రయాలపై పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. అనుమతులు లేకుండా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మందుగుండు సామగ్రి విక్రయాల కోసం లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేస్తూ.. దరఖాస్తుదారులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలను సూచించింది.

- లైసెన్స్ పొందిన దుకాణాల మధ్య కనీసం 15 మీటర్లు, గ్రీన్ క్రాకర్స్ అమ్మే దుకాణాల మధ్య 10 అడుగుల దూరం ఉండాలి.
- విద్యుత్, అగ్నిమాపక, జీవీఎంసీ విభాగాల నుంచి తప్పనిసరిగా ఎన్‌వోసీ పొందాలి. వాణిజ్య పన్నుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాలి.
- లైసెన్స్ పొందిన ఫ్యాక్టరీ లేదా కంపెనీ నుంచి మాత్రమే బాణసంచా కొనుగోలు చేయాలి.
- విక్రేతలు గ్రీన్ క్రాకర్స్ మాత్రమే విక్రయించాలి. క్లోరేట్ కలిగిన బాణసంచా నిల్వ చేయకూడదు.
- దుకాణాలు అగ్నిమాపక కేంద్రాలకు అందుబాటులో ఉండాలి. ప్రతి దుకాణం వద్ద ఇసుక బకెట్లు, నీరు, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచాలి.
- 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వ్యక్తులకు క్రాకర్లు అమ్మకూడదు.

కొనుగోలుదారులకు సూచనలు

- దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే క్రాకర్స్ కాల్చాలి.
- హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించకూడదు. సాధారణ సబ్బులను వాడాలి.
- అనధికారిక నిల్వలు లేదా విక్రయాలపై అనుమానం ఉంటే.. పౌరులు నేరుగా డయల్ 100/112కు గాని లేదా సీపీ ఫోన్ నంబర్ 79950 95799కు గాని సమాచారం అందించాలని పోలీస్ శాఖ కోరింది.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో నియామకాలు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో పలువురిని నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- జిల్లా యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా గుంటు ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా పిలకా సంపత్ కుమార్ రెడ్డి, పీతల అప్పల రాము, తమ్మినేని శ్రీనివాసరావు, ఆర్.ప్రభాకర్ నాయుడు, కార్యదర్శిగా ఎ.నాగ సత్యనారాయణతో పాటు ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా మహిళా విభాగం కమిటీ వైఎస్ ప్రెసిడెంట్‌గా సూరాడ వెంకట లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా మండెం పద్మజ, గొంతెన వెంకట లక్ష్మి, కార్యదర్శి కుసుమ పిడింట్లతోపాటు ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా ఎస్సీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బుడుమూరి ఈశ్వరరావు, భాగం స్వాతి సుధాకర్, జలదుల తారకేశవరావు రావు, ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా చెన్నా అప్పారావు, వి.అప్పారావు, కార్యదర్శులు మారుపల్లి పరదేశి, బొట్ట సింహాచలం, సంపంగి ఈశ్వరరావు, ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- జిల్లా ఎస్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా మారిక గణేష్, బుసకల సత్యవతి, దాసరి దాసు, పఠాన్ సర్దార్ ఖాన్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- జిల్లా మైనారిటీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ ముసవ్విర్, ప్రధాన కార్యదర్శిగా మహమద్ నిజాముద్దీన్, కార్యదర్శులుగా సయద్ హుస్సేన్, షేక్ షరీఫ్, ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కండిమళ్ల రాజశేఖర్
- జిల్లా విద్యార్థి విభాగం వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా రామశెట్టి, కార్యదర్శిగా విశ్వనాథ్ జశ్వంత్, ఒక ఎగ్జిక్యూటివ్ మెంబర్
- జిల్లా మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా కన్నెటి సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా వడబోయిన హను గంగురాజు, పోలవరపు శ్రీహరి
- జిల్లా వలంటీర్ వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా ఒలిశెట్టి శ్రీనివాస్, కరణం వేణు గోపాలరావు, ఎల్లపు రాము, కోలటి దుర్గా, కార్యదర్శులుగా నక్కని వంశీ, కంబాల మహేంద్ర దేవ, ఉబ్బా రాము
- జిల్లా గ్రీవెన్స్ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాసరావు, బోరా రాము
- జిల్లా వాణిజ్య విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బోనం శ్రీనివాసరావు, గొలగాని త్రినాథరావు, కార్యదర్శిగా దగ్గపు ధనప్ప
- జిల్లా వైఎస్సార్‌టీయూసీ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బూమిరెడ్డి వెంకటరెడ్డి, సీపాన రాము, కార్యదర్శులుగా చింతపల్లి శ్రీనివాసరావు, షేక్ ఖాన్, చుక్కా వరుణ్‌కుమార్ రెడ్డి
- జిల్లా అంగన్‌వాడీ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఇప్పిలి పార్వతీ
- కల్చరల్ వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి వెంకట రమేష్
- జిల్లా లీగల్ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పిల్లా శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా మొల్లి రామారావు, సయ్యద్ రవి, కార్యదర్శులుగా బాగాడి తులసీదాస్, అందుకూరి ఎస్.ఎల్.ఎన్ రాజు, దాసరి గణేష్
- జిల్లా సోషల్ మీడియా వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా వుంగరాల చరణ్ కుమార్, నీలపు చిన్నా రెడ్డి, ధర్మపూరి చక్రవర్తి, కార్యదర్శులుగా బోయి రాజశేఖర్ రెడ్డి, మెట్ట సూర్యనారాయణ, బొడ్డు ధనరాజు, పాట్నూర్ చందన్ సాయి, వెలుగుల జగదీష్, మారం శ్రీకాంత్
- జిల్లా ఇంటిలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా కె.వెంకట గోపాల్ సురేష్, కార్యదర్శులుగా కొండపల్లి వెంకట రమణ, నంబూరి రాజును, జిల్లా బూత్ కమిటీ వింగ్‌లో కార్యదర్శిగా పిన్నింట్ల వెంకట నరసింహ రెడ్డి, జిల్లా డాక్టర్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా కోడి సూర్యకుమారి
- జిల్లా ఐటీ వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా షేక్ అబ్దుల్ కదర్, కుప్పిలి లావణ్య రెడ్డి, కార్యదర్శిగా చుక్కా జయలక్ష్మితో నలుగురిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

ఏయూ పరువు పాయే..!

- వైస్‌చాన్సలర్‌కు అవమానం..!
- బాణసంచా దుకాణాల అనుమతుల విషయంలో విచిత్రం
- ఎన్నడూ లేని విధంగా ఉన్నత విద్యా శాఖ జోక్యం
- అనుమతులు ఇవ్వాలంటూ ఏయూ వీసీకి లేఖ రాయడంపై చర్చ
- వీసీ పరువు తీశారంటూ వర్సిటీలో దుమారం
- అనుమతులకు ముందే పనులు ప్రారంభంపై 'సాక్షి' కథనంతో ప్రకంపనలు
- ఉలిక్కిపడిన యంత్రాంగం.. కలెక్టర్ సీరియస్
- హెలీప్యాడ్ గ్రౌండ్ నుంచి పార్కింగ్ గ్రౌండ్‌కు వేదిక మార్పు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ మరో వివాదం రాజుకుంటోంది. ఏయూలో బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం అగ్గి రాజేస్తోంది. ఏయూ వీసీ అనుమతులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఎన్నడూ లేని విధంగా తాత్కాలిక స్టాళ్ల అనుమతులకు ఉన్నత విద్యా శాఖ లేఖ రాయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇది వైస్ చాన్సలర్ పరువు తీయడమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామం విశ్వవిద్యాలయ అధికార, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కల్పించుకోవడం వెనుక ఆంతర్యమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఏయూ నుంచి అనుమతులు రాకముందే స్టాళ్ల ఏర్పాటు పనులు చేపట్టడంపై 'సాక్షి' ప్రచురించిన కథనంతో అధికార వర్గాల్లో ప్రకంపనలు రేగాయి. దీనిపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయినట్లు సమాచారం.

ఉన్నత విద్యా శాఖ జోక్యంపై చర్చ

సాధారణంగా ఏయూలో కార్యక్రమాల నిర్వహణకు ఏయూ సమావేశ మందిరాలు, మైదానాలు లీజుకు ఇవ్వడం సర్వసాధారణమైన విషయం. ఎవరైనా కార్యక్రమం నిర్వహణకు దరఖాస్తు చేసుకొని నిర్ణీత రుసుము చెల్లిస్తే.. ఏయూ వీసీ అనుమతులు ఇస్తుంటారు. గతంలో ప్రైవేటు కార్యక్రమాలకు కూడా అనుమతులు ఇచ్చేవారు. అయితే ఏయూ రాజకీయ వేదికగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ప్రైవేటు కార్యక్రమానికి ఏయూ, దానికి సంబంధించిన మైదానాల్లో అనుమతులు మంజూరు చేసే అవకాశం లేదు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ఆలోచన చేస్తోంది. దీనిపై ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ హెలీప్యాడ్ గ్రౌండ్‌ను లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ స్వయంగా ఏయూ వీసీకి లేఖ రాశారు. దీనిపై ఏయూ వీసీ నిర్ణయం తీసుకోకముందే పనులు జరిగిపోయాయి. ఇదిలా ఉంటే ఈ అనుమతుల విషయంలో నేరుగా ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం ఇపుడు వర్సిటీలో చర్చకు దారితీసింది. ఏయూ వీసీ నిర్ణయం తీసుకోవాల్సిన్న సర్వసాధారణ విషయంలో రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కల్పించుకోవాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు అధికార వర్గాల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఇది ఏయూ వీసీని అవమానించడమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన స్టాళ్లు

21వ తేదీ వరకు అనుమతులు

కలెక్టర్ హరేందిర ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ హెలీప్యాడ్ గ్రౌండ్ లేదా దాని ఎదురుగా ఉన్న పార్కింగ్ మైదానాన్ని తాత్కాలిక స్టాళ్ల ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కార్యాలయం నుంచి ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ వచ్చింది. ఈ నెల 15న ఈ లేఖ రాగా వెంటనే ఏయూ వీసీ కూడా అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. కానీ 14వ తేదీ నుంచి అనుమతులు కోరినట్లు ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే ఆయన అనుమతులకు ముందే ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ పార్కింగ్ మైదానంలో మళ్లీ పనులు ప్రారంభించేయడం విశేషం. ప్రస్తుతం అనుమతులు ఉండడంతో పనులు జరుగుతున్నాయి.

'కూటమి' జోక్యంతో వివాదం

ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ హెలీప్యాడ్ మైదానంలో స్టాళ్ల ఏర్పాటు కోసం అనుమతులు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ రాశారు. దీనిపై ఏయూ వీసీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అనుమతులు ఇవ్వకముందే గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. దీనిపై సాక్షి 'ఏయూ-జీవీఎంసీ మధ్య దివాళీ ట్రేడ్ ఫైర్' అంటూ కథనం ప్రచురించింది. దీంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఏ శాఖ నుంచి అనుమతులు రాకముందే, ఏయూ వీసీ గ్రౌండ్‌ను లీజుకు ఇవ్వకముందే పనులు చేపట్టడంపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయ్యారు. వెంటనే ఆ పనులను ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే కూటమి ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. జిల్లా అధికారులతో పాటు ఏయూ వీసీతో కూడా మాట్లాడి అనుమతులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. సదరు ప్రజాప్రతినిధి అనుచరులే ఈ మందుగుండు స్టాళ్ల పేరుతో దందాకు తెరతీసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో స్టాల్‌ను రూ.1.5 లక్షలకు బేరం పెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఏయూ గ్రౌండ్‌లో దుకాణాలను ఏర్పాటు చేయించాలని ప్రజాప్రతినిధి గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది.

సమ్మిట్ ఏర్పాట్లలో నాణ్యత ముఖ్యం

ఇంజినీరింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం


సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: విశాఖ వేదికగా నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ పనులను నిర్ణీత సమయానికి, నాణ్యతతో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణరాజు, ఇతర అధికారులతో కలిసి గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు సమయం తక్కువగా ఉన్నందున, రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మరమ్మతులు వంటి అన్ని అభివృద్ధి పనులను నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రముఖులు రానున్న దృష్ట్యా, విశాఖ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న మీడియన్లు, ఐల్యాండ్‌లలో ఆకర్షణీయమైన మొక్కలు, పెయింటింగ్‌లు, విద్యుత్ కాంతుల పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో లోటుపాట్లు, అడ్డంకులు లేకుండా క్వాలిటీ కంట్రోల్ పాటిస్తూ, సంబంధిత విభాగాల సంయుక్త కార్యాచరణతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. ఆపరేషన్ లంగ్స్ 2.0లో భాగంగా ఆక్రమణలు తొలగించిన తర్వాత, అర్హులైన వీధి విక్రయదారులకు టౌన్ ప్లానింగ్ విభాగం సూచించిన స్ట్రీట్ వెండింగ్ జోన్లను తక్షణమే మౌలిక సదుపాయాలతో సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఇంజినీర్లు రాయల్‌బాబు, సంపత్‌కుమార్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంతుని పవిత్రోత్సవాలు ప్రారంభం


మేదిని మాతకు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం రాత్రి వేద పండితుల వేద మంత్రోచ్చారణాల నడుమ పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్ర పెరుమాళ్లను పల్లకిలో పాత సంత స్థలం వద్దకు పల్లకీలో తోడ్కొని వచ్చారు. ఇక్కడ మేదిని మాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, మొకర అప్పలనాయుడు, తాలాడ పైడిరాజు, అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

‘గోదావరి’ కోసం అంత తొందరేంటో?

- రూ.950 కోట్ల వ్యయంతో భారీ డ్రెడ్జర్ నిర్మాణం
- పనులు పూర్తవ్వకముందే ప్రారంభించేందుకు సన్నాహాలు
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ అధికారి అత్యుత్సాహం
- 18నే ప్రారంభించేందుకు ఏర్పాట్లు



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: సంస్థలన్నింటిలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) తీరు వేరు అన్నట్లుగా ఉంది ఇక్కడి అధికారుల వ్యవహారం. నిర్మాణం పూర్తికాకుండానే డ్రెడ్జర్‌ను ప్రారంభించేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కొచ్చిన్ షిప్‌యార్డులో నిర్మితమవుతున్న భారీ డ్రెడ్జర్ 'గోదావరి'ని ఈ నెల 18న ప్రారంభించేందుకు (కమిషనింగ్) డీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి దీని పనులు పూర్తవ్వాలంటే మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కానీ కొత్తగా ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్న ఓ అధికారి.. తన హయాంలోనే ఈ అతిపెద్ద డ్రెడ్జర్ ప్రారంభమైందని చెప్పుకోవాలనే ఆత్యాశతోనే ఈ అడ్డగోలు కార్యక్రమానికి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

డీసీఐలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఇష్టారాజ్యంగా నిర్ణయాలు అమలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారి పదవిలో ఉన్నా లేకపోయినా.. అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ అధికారి అర్థం లేని నిర్ణయాలు తీసుకుంటూ డీసీఐ పరువును బంగాళాఖాతంలో కలిపేసేందుకు ప్రయత్నిస్తున్నారని సంస్థ వర్గాలే ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కాంట్రాక్టుల నుంచి బదిలీల వరకు అన్నింటా ఆయన చెప్పిందే శాసనంగా మారిందని అంటున్నారు. తాజాగా 'గోదావరి' డ్రెడ్జర్ ప్రారంభోత్సవం విషయంలోనూ అదే తీరుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

బాస్ వస్తే.. తనకు పేరు రాదని..!

భారతదేశంలో ఇప్పటివరకు నిర్మించిన అత్యంత అధునాతనమైన 'గోదావరి' డ్రెడ్జర్‌ను ఈ నెల 18న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు పూర్తికాకుండా కమిషనింగ్ చేయడం వెనుక సదరు అధికారి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఆయన నియామకంపై ఉత్తర్వులు వెలువడేలా అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని సమాచారం. ఆయన మరో మూడు నెలల పాటు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మూడు నెలల తర్వాత పూర్తిస్థాయి బాస్ వస్తే.. ఈ ఘనత తన ఖాతాలో చేరదనేది ఆ అధికారి దూరదృష్టిగా కనిపిస్తోంది. అందుకే అతిపెద్ద డ్రెడ్జర్ ప్రారంభోత్సవం తన హయాంలోనే జరిగిందన్న పేరు నిలిచిపోవాలని ఆదరాబాదరాగా ఈ కార్యక్రమానికి తెరలేపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, డీసీఐ ఉన్నతాధికారి పోస్టుకు బోర్డు ప్యానల్ ముగ్గురు అనుభవజ్ఞులను ఎంపిక చేసింది. వీరిని ఇంటర్వ్యూ చేసి ఒకరిని నియమించాల్సి ఉంది. అయితే ఈ ముగ్గురిలో ఎవరు ఎంపికైనా తన ప్రాధాన్యత తగ్గుతుందనే భయంతో ఆ అధికారి.. ఆ ఫైల్ ముందుకు కదలకుండా అడ్డుకుంటున్నారని కూడా తెలుస్తోంది.

'గోదావరి'వస్తే డీసీఐ బలోపేతం

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా 'గోదావరి' ట్రయిలింగ్ సక్షన్ హాపర్ డ్రెడ్జర్(టీఎస్‌హెచ్‌డీ)ని డీసీఐ నిర్మిస్తోంది. సుమారు రూ.950 కోట్ల వ్యయంతో ఇది రూపుదిద్దుకుంటోంది. భారత సముద్ర రవాణా సామర్థ్యంలో 'గోదావరి'ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఇది 127 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నిర్మితమవుతోంది. ప్రస్తుతం డీసీఐ వద్ద 10 ట్రయిలింగ్ సక్షన్ హాపర్ డ్రెడ్జర్లు, ఒక కట్టర్ సెక్షన్ హాపర్ డ్రెడ్జర్, ఒక బ్యాక్ హో డంబ్‌నాన్ ప్రొపెల్లడ్, ఒక ఇన్‌లాండ్ కట్టర్ సక్షన్ డ్రెడ్జర్లు ఉన్నాయి. వీటన్నింటి సామర్థ్యం 59,000 క్యూబిక్ మీటర్లు కాగా.. 'గోదావరి' ఒక్కదాని సామర్థ్యమే 12,000 క్యూబిక్ మీటర్లు. అంటే.. గోదావరి చేరిన తర్వాత డీసీఐ మొత్తం సామర్థ్యం 71,000 క్యూబిక్ మీటర్లకు చేరనుంది. ఇంతటి ప్రతిష్టాత్మక డ్రెడ్జర్ తయారీ విషయంలో సదరు అధికారి తన స్వప్రయోజనం చూసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పనులు పూర్తి కాకున్నా.. ప్రారంభించేద్దాం!

భారతదేశంలోనే అతిపెద్ద డ్రెడ్జర్‌ను డీసీఐ నిర్మిస్తోంది. నెదర్లాండ్స్‌కు చెందిన రాయల్ ఐహెచ్‌సీ సహకారంతో కొచ్చిన్ షిప్‌యార్డులో తయారవుతున్న ఈ డ్రెడ్జర్ కీల్ (నిర్మాణంలో ప్రధాన దశ)ను 2024 సెప్టెంబర్‌లో కేంద్ర షిప్పింగ్, జల రవాణా శాఖామంత్రి సర్బానంద సోనోవాల్ వర్చువల్‌గా ప్రారంభించారు. వాస్తవానికి ఈ డ్రెడ్జర్‌కు 'బ్రహ్మపుత్ర'అని కేంద్ర మంత్రిత్వ శాఖ పేరు సూచించగా.. తర్వాత 'గోదావరి'గా మార్చారు. ప్రస్తుతం ఈ నౌకా నిర్మాణం ట్రయల్ రన్ దశలో ఉంది. ఒకటి రెండు ట్రయల్ రన్స్ నిర్వహించి, లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిచేశాకే కమిషనింగ్ చేస్తారు. ఇందుకు మరో మూడు నెలల సమయం పడుతుందని షిప్‌యార్డు వర్గాలు స్పష్టం చేస్తున్నా.. డీసీఐ మాత్రం పనులు పూర్తి కాకున్నా ఫర్వాలేదు, ఈ నెలలోనే ప్రారంభించేద్దామని తొందరపెడుతోంది.

ఏయూలో అంధకారం

- నీటి సమస్యతోనూ ఇబ్బందులు
- మహిళా ఇంజినీరింగ్ హాస్టల్‌లో దారుణ పరిస్థితులు
- ఆందోళనకు దిగిన విద్యార్థినులు

విశాఖ సిటీ: శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం అంధకారంలో కూరుకుపోయింది. ఏయూ ఇంజినీరింగ్ వుమెన్ హాస్టల్‌లో గురువారం ఉదయం నుంచి కరెంట్ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం తర్వాత ఏయూ క్యాంపస్ మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. చీకట్లు అలుముకున్నాయి. ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీని వరుస వివాదాలు, సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రధానంగా విద్యార్థుల విషయంలో ఏయూ అధికారుల నిర్లక్ష్య వైఖరి మరోసారి బయటపడింది. ఇప్పటికే పురుగుల భోజనం, వైద్య సదుపాయాలు లేక విద్యార్థి మరణం ఏయూలో కలకలం రేపగా.. తాజాగా నార్త్ క్యాంపస్‌లోని సావిత్రిబాయి పూలే మహిళా వసతి గృహంలో విద్యుత్, నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థినులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఏయూ అధికారులకు చెప్పేందుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో విద్యార్థినులు సాయంత్రం ఆందోళనకు దిగారు.

విద్యార్థినుల ఆందోళన

గురువారం ఉదయం నుంచి విద్యుత్, నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థినులు ఏయూ అధికారులకు అనేకసార్లు సమాచారం అందించేందుకు ప్రయతి్నంచారు. అయినప్పటికీ ఎవరి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం గమనార్హం. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఎవరూ ఎత్తకపోవడంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికి కూడా అదే పరిస్థితి ఉండడంతో ఆందోళనకు దిగారు. అప్పుడు హాస్టల్ అధికారులు వచ్చి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పోయిందని విద్యుత్ శుక్రవారం వస్తుందని చెప్పారు. అలాగే నీటి సమస్యపై అనేకసార్లు అధికారులకు లేఖలు రాశామన్నారు. అయినప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించమని తేల్చి చెప్పారు. ఆ తర్వాత 10 నిమిషాలకు విద్యుత్‌తో పాటు నీరు వచ్చింది. మళ్లీ కొద్ది సేపటికే విద్యుత్ ఆగిపోయింది. ఈ సారి ఏయూ క్యాంపస్ మొత్తానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఉదయం నుంచి నిలిచిపోయిన విద్యుత్

ఏయూ నార్త్ క్యాంపస్‌లోని సావిత్రిబాయ్ పూలే మహిళా హస్టల్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి కరెంట్‌తో పాటు నీటి సరఫరా కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. కాలకృత్యాలకు, తాగునీటికి కూడా నీరు లేకపోవడంతో బయట వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి గొంతులు తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలంగా హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా పట్టి పీడిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్‌కు, అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు వాపోయారు





పాత కక్షతోనే వివాహిత హత్య

- ఏసీపీ లక్ష్మణమూర్తి వెల్లడి
- నిందితుడు శ్రీను అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి (ఇన్‌సెట్) హత్యకు ఉపయోగించిన కత్తి

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెంలోని నందగిరినగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కావల శ్రావణ సంధ్య అలియాస్ సోని(38) దారుణ హత్యకు పాత గొడవలే కారణమని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ కేసు వివరాలను ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. శ్రావణ సంధ్యకు 9 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్త మణికంఠతో మనస్పర్థల కారణంగా విడిపోయి, గత ఏడేళ్లుగా తన ఇద్దరు పిల్లలతో కలిసి నందగిరినగర్‌లో నివసిస్తోంది. మణికంఠ ప్రస్తుతం రాయగడలో ఉంటున్నాడు. వీరి విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. నిందితుడు శ్రీను(కార్పెంటర్) కూడా అదే ప్రాంతంలో, తన సోదరుడి ఇంట్లో నివసిస్తున్నాడు. సుమారు 8 నెలల కిందట శ్రీను.. శ్రావణ సంధ్య స్కూటీని డామేజ్ చేయడంతో, ఆమె ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పుడు పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చినా, శ్రీను ఆమెపై పగ పెంచుకున్నాడు. దీనికితోడు శ్రీను తరచుగా మరొక అమ్మాయితో మాట్లాడడాన్ని గమనించిన శ్రావణ సంధ్య, అతడిని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మళ్లీ వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న శ్రీను.. కోపం పెరిగి, కార్పెంటరీ పనుల కోసం ఉపయోగించే పదునైన కత్తితో శ్రావణ సంధ్య మెడపై తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతురాలి సోదరి దేవి సంతోషికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హత్య అనంతరం శ్రీను తప్పించుకోవడానికి ప్రయత్నించగా.. ఫోర్త్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ఉమాకాంత్ తన బృందంతో మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న ఫోర్త్‌టౌన్ పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ-1 మేరి ప్రశాంతి అభినందించారు.

స్నేహితుడిని పరామర్శించి వస్తూ మృత్యువాత

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


బొడ్డేడ వంశీ (పాత చిత్రం)

గోపాలపట్నం: చేతికి అందివచ్చి.. ఇంటికి అండగా ఉంటున్న కొడుకు మరణం ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆరు నెలల కిందట చెల్లెలి పెళ్లి చేసి మురిసిన అన్నయ్య.. ఈ రోజు కన్నీటి జ్ఞాపకంగా మిగిలిపోయాడు. స్నేహితుడిని పరామర్శించి వస్తున్న ఆ యువకుడిని మృత్యువు రోడ్డు రూపంలో కబళించింది. వేపగుంటలో ఉంటున్న స్నేహితుడికి తేలు కుట్టిందని తెలిసి పరామర్శించేందుకు బుధవారం రాత్రి వెళ్లిన బొడ్డేడ వంశీ (24) తిరిగి ఇంటికి వస్తుండగా.. అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిపై ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి. అక్కయ్యపాలెంలో నివాసముంటున్న వంశీ స్వస్థలం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం చేమలాపల్లి. ట్రావెల్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై వేపగుంట నుంచి వస్తుండగా.. ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో వెనుకనే అతివేగంగా వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ధాటికి అదుపుతప్పిన వంశీ లారీ చక్రాల కింద పడి నలిగిపోయాడు. లారీ అతన్ని సుమారు 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లడంతో వంశీ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. కుటుంబానికి అండగా ఉంటున్న కుమారుడు అకాల మరణంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తండ్రి రామకృష్ణ లారస్ సంస్థలో హౌస్ కీపర్‌గా పనిచేస్తున్నారు. బుద్ధిమంతుడైన కొడుకు లేడనే నిజాన్ని జీర్ణించుకోలేక వారు పడుతున్న వేదన అక్కడివారిని సైతం కంటతడి పెట్టించింది. ఆరు నెలల కిందటే వంశీ తన చెల్లెలు కావ్యకు అన్నీ తానై వివాహం జరిపించాడు. ఆ తీపి జ్ఞాపకాలు ఇంకా మరువకముందే.. అన్న మరణవార్త విన్న కావ్య కన్నీటి పర్యంతమైంది. తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఎమ్మెల్యే గంటా పేరుతో భూదందా?

- కోర్టు వివాదంలోని స్థలం కబ్జాకు యత్నం
- రక్షణ కల్పించాలని స్థల యజమానుల విజ్ఞప్తి


వివాదంలో ఉన్న భూమిలో ఫెన్సింగ్ పనులు చేస్తున్న ప్రత్యర్థి వర్గం

మధురవాడ: విశాఖ రూరల్ మండలం, మధురవాడలోని మిథిలాపురి వుడా కాలనీలో కోర్టు వివాదంలో ఉన్న స్థలంలోకి కొందరు వ్యక్తులు చిల్లర రౌడీలతో ప్రవేశించి ఫెన్సింగ్ పనులు చేస్తున్నారని స్థల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. పీఎంపాలెం పోలీసులు ఎవరినీ భూమిలోకి వెళ్లవద్దని ఆదేశించినప్పటికీ, తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. గురువారం స్థల యజమాని ఎం.బి.శ్రీనివాస్, కుటుంబ సభ్యులు సరోజాదేవి, పద్మజ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఫెన్సింగ్ వేయడానికి వచ్చిన వారు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మనుషులమంటూ దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి 630 గజాలను 1991లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 221 గజాలను చర్చికి విక్రయించామన్నారు. ల్యాండ్ రికార్డులు, ఈసీలో కూడా తమ పేర్లే చూపుతున్నప్పటికీ.. ప్రత్యర్థి వర్గం దౌర్జన్యానికి దిగుతోందని వాపోయారు. ఈ భూమికి సంబంధించి కోర్టు వివాదంలో ఉందని, పీఎల్‌సీఎఫ్‌లో కూడా పెండింగ్‌లో ఉందని తెలిపారు. భూమిలోకి అక్రమ ప్రవేశంపై తాము 112 నంబర్‌కు ఫిర్యాదు చేయగా.. పోలీసులు వచ్చి పనులను ఆపమని హెచ్చరించారు. అయితే కొద్దిసేపు ఆగిన తర్వాత, వారు మళ్లీ యథావిధిగా పనులు కొనసాగించడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన వారి నుంచి తమకు, తమ ఆస్తికి తక్షణమే రక్షణ కల్పించాలని వారు కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్యవతి


సత్యవతి | ఆర్ఎన్ మాధవి | కొండమ్మ

డాబాగార్డెన్స్: అనంతపురంలో జరిగిన ఐద్వా (ఆల్ ఇండియా డెమోక్రటిక్ వుమెన్స్ అసోసియేషన్) 16వ రాష్ట్ర మహా సభల్లో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో ఐద్వా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే కమిటీ సభ్యులుగా విశాఖకు చెందిన ఆర్.ఎస్.మాధవి, డి.కొండమ్మలను ఎన్నుకున్నారు. మహిళల హక్కులు, లైంగిక దాడులు, హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఇచ్చిన పిలుపును విశాఖలో పటిష్టంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా సత్యవతి తెలిపారు. ఇప్పటికే విశాఖలో మద్యంపై పోరు సాగిస్తున్నట్టు ఆమె వివరించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని, లులూ మాల్, గూగుల్ వంటి సంస్థలకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని చేసిన పోరాటాలను మహాసభ ప్రశంసించిందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి పోరాటాలు కొనసాగిస్తామని సత్యవతి స్పష్టం చేశారు.

పని చేసిన ఇంట్లోనే దొంగతనం

అక్కాచెల్లెళ్ల అరెస్ట్

కూర్మన్నపాలెం: తాను పని చేస్తున్న ఇంటిలోనే దొంగతనం చేసిన ఒక మహిళను, ఆమెకు సహకరించిన ఆమె సోదరిని దువ్వాడ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరసింగరావు తెలిపిన వివరాలివి. రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్న వి.నరసింగరావు ఇంట్లో అనకాపల్లి జిల్లా, సోమలింగాపురానికి చెందిన కె.నాగమణి కొంతకాలంగా పనులు చేస్తోంది. నరసింగరావు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి.. బీరువాలోని చెవిదుద్దులు, పచ్చల హారాన్ని నాగమణి దొంగిలించింది. నగలు చోరీకి గురయ్యాయని గుర్తించిన నరసింగరావు ఈ నెల ఒకటో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా.. నాగమణి ఆ నగలను దొంగిలించి, వాటిని తన సోదరి సిహెచ్ సీతకు ఇచ్చినట్లు కనుగొన్నారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి.. ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

సాగరతీరాన ఆసీస్ విజయ గర్జన

బంగ్లాపై ఒక్క వికెట్ కోల్పోకుండా ఘన విజయం



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బంగ్లాదేశ్‌పై ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా గెలిచి, టోర్నమెంట్‌లో సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. ఈ విజయంతో ఆసీస్ జట్టు టోర్నీలో తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటి చెప్పింది. సిరీస్‌లో కెప్టెన్ అలిస్సా హీలీ వరుసగా రెండో సెంచరీతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఓపెనర్లు హీలీ, లిచ్‌ఫీల్డ్ కలిసి 202 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో ఆస్ట్రేలియా 9 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత మ్యాచ్‌లో చివరి వరకు గట్టి పోటీ నిచ్చిన బంగ్లా ఈ మ్యాచ్‌లో పూర్తిగా నిరాశపరిచింది. కాగా.. అంతర్జాతీయ స్థాయి మ్యాచ్ నగరంలో జరగడం, అందులోనూ ఆస్ట్రేలియా వంటి అగ్రశ్రేణి జట్టు రికార్డు స్థాయిలో ప్రదర్శన చేయడం స్థానిక క్రీడాకారుల్లో, ముఖ్యంగా యువ క్రికెటర్లలో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపింది. ప్రపంచ స్థాయి క్రీడాకారుల ఆటతీరును ప్రత్యక్షంగా వీక్షించడం తమకు ఒక అద్భుతమైన అనుభవమని, వారి అంకితభావం, నైపుణ్యం తమకు ఆదర్శమని పలువురు యువ క్రీడాకారులు అభిప్రాయపడ్డారు.